
సాక్షి
గుంటూరు
సోమవారం । 17 । మార్చి । 2025



బగళాముఖికి ప్రజ్ఞానందస్వామి పూజలు

కర్లపాలెం: చందోలు బగళాముఖి అమ్మ వారిని ఆదివారం పెనుగొండ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి పీఠాధిపతి ప్రజ్ఞానంద స్వామి దర్శించుకుని పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 519.20 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 8,023 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ నిత్యాన్నదానానికి హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన ఎంఎం విశ్వరాజ్ ఆదివారం రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
గుంటూరు	6.24	4.58
నరసరావుపేట	6.26	5.00
బాపట్ల	6.24	4.58

న్యూస్‌రీల్

టెన్త్ పరీక్షల విధులకు గైర్హాజరైన టీచర్లకు షోకాజ్ నోటీసులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల విధుల్లో ఇన్విజిలేటర్లుగా నియమించిన 10 మంది ఉపాధ్యాయులకు గుంటూరు తూర్పు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ ఆదివారం షోకాజ్ నోటీసులు ఇచ్చారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను వేర్వేరు పాఠశాలల్లో ఇన్విజిలేటర్లుగా నియమించారు. అయితే వీరిలో 10 మంది ఉపాధ్యాయులు సోమవారం నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల విధులకు హాజరయ్యేందుకు ఆదివారం సంబంధిత పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు రిపోర్టు చేయలేదు. దీంతో సంబంధిత ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

హామీలు నెరవేర్చేందుకు కృషి

కేంద్ర మంత్రి పెమ్మసాని



పెదకాకాని: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు, పెదకాకాని, కొప్పురావూరు గ్రామాల్లో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లను పెమ్మసాని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. సీఎం చంద్రబాబు త్వరలో తల్లికి వందనం, మహిళలకు జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం అమలుతోపాటు అన్నదాతలకు రైతు భరోసా నిధులు విడుదలకు కృషి చేస్తున్నట్టు వివరించారు.

క్వారీ దేవస్థానంలో ఎస్పీ దంపతుల ప్రత్యేక పూజలు



చేబ్రోలు: జిల్లాలో ఖ్యాతి గాంచిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన ఎస్పీ దంపతులకు ఆలయ అర్చకులు గూడూరు సాంబశివరావు, శ్రీనివాసశర్మ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖాధికారి పి.రామకోటేశ్వరరావు వారిని సత్కరించి, ప్రసాదం అందజేశారు. ఎస్ఐ డి.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో కౌన్సెలర్ల నియామకం



నరసరావుపేట ఈస్ట్: జిల్లావ్యాప్తంగా ఉన్న 24 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో విద్యార్థినులకు మానసిన స్థైర్యం కల్పించేందుకు ఐదుగురు కౌన్సెలర్లను నియమించినట్లు జిల్లా బాలికా సంక్షేమాభివృద్ధి అధికారి డి.రేవతి ఆదివారం తెలిపారు. కేజీబీవీ పాఠశాలల్లోని బాలికలకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించి వారిలో ఒత్తిడిని జయించేలా తగు సూచనలను కౌన్సిలర్లు అందిస్తారని వివరించారు. జె.అశోక్, ఎ.శాంతివర్ధన్, కె.ప్రేమ్‌కుమార్, యూసఫ్ షరీఫ్, ఫణింద్రకుమార్‌లను కౌన్సెలర్లుగా సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం నియమించినట్టు తెలిపారు. రానున్న వారం రోజుల్లో 14 పాఠశాలలోని విద్యార్థినులకు కౌన్సెలర్లు గ్రూప్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యయోస్తు

- ఏపీ ఈఏపీసెట్-2025 షెడ్యూల్ విడుదల
- మే 21 నుంచి 27 వరకు ఏపీ ఈఏపీసెట్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహణ
- మే 19,20వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- ఏప్రిల్ 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 40 ఇంజినీరింగ్ కళాశాలల్లో 20వేల సీట్లు

ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె



సీనియర్ ఇంటర్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విద్యార్థతతో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విడుదల చేసిన ఏపీ ఈఏపీసెట్-2025 (గతంలో ఎంసెట్) నోటిఫికేషన్ ఆధారంగా విద్యార్థులు సన్నద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైంది. సీనియర్ ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఏపీ ఈఏపీ సెట్-2025 ఆధారిత ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న 40 ఇంజినీరింగ్ కళాశాలల పరిధిలో 20వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఏపీ ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు తమ ర్యాంకు ఆధారంగా ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు రాష్ట్రంలో ఎక్కడైనా ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశం పొందవచ్చు. సీనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన ఎంపీసీ, బైపీసీ గ్రూపుల విద్యార్థులు cets.apsche.ap.gov.in సైట్‌కు లాగిన్ అయ్యి ఏపీ ఈఏపీసెట్-2025పై క్లిక్ చేయాలి. ఏపీఈఏపీసెట్ సైట్‌లో పరీక్ష రాసేందుకు అర్హతలు, దరఖాస్తు పూరింపు ప్రక్రియతోపాటు కోర్సుల వివరాలు, ఏపీఈఏపీ సెట్‌కు సంబంధించిన ముఖ్యమైన తేదీలు, ఇన్‌స్ట్రక్షన్స్ మాన్యువల్ తదితర పూర్తి వివరాలను పొందవచ్చు.

ఏపీ ఈఏపీ సెట్‌కు దరఖాస్తు ఇలా..

ఏపీఈఏపీసెట్-2025 సైట్‌కు లాగిన్ అయిన తరువాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు స్టెప్-1 మొదలు స్టెప్-5 వరకు ఐదు దశల్లో కనిపించే ట్యాబ్‌లను వరుస క్రమంలో క్లిక్ చేస్తూ, పొందుపర్చిన వివరాలు పూర్తి చేయాల్సి ఉంటుంది.

☛ స్టెప్-1 : 'ఎలిజిబులిటీ క్రైటీరియా అండ్ ఫీజు పేమెంట్'కు లాగిన్ అయ్యి సీనియర్ ఇంటర్ హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేయాలి. అనంతరం విద్యార్థి పుట్టిన తేదీ, మొబైల్ నంబరు, ఆల్టర్నేటివ్ మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ నమోదు చేయాలి. దీంతో పాటు ఇంజినీరింగ్-ఫార్మసీ, అగ్రికల్చర్-ఫార్మసీ, బోత్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీల వారీగా తాము రాయబోవు ప్రవేశ పరీక్ష, చేరనున్న కోర్సుల వారీగా మూడు ఆప్షన్లలో ఒక దానిని ఎంపిక చేసుకుని, క్లిక్ చేయాలి.

✦ తరువాత సామాజికవర్గాల వారీగా కేటగిరీపై క్లిక్ చేసి, ఆన్‌లైన్‌లో ఫీజు పేమెంట్ చేయాలి. క్రెడిట్, డెబిట్‌కార్డు, నెట్ బ్యాంకింగ్ మార్గాల్లో ఫీజు చెల్లించాల్సి ఉంది.

☛ స్టెప్-2 : నో యువర్ పేమెంట్ స్టేటస్‌పై క్లిక్ చేసి, సీనియర్ ఇంటర్ హాల్ టికెట్ నంబరు, మొబైల్ నంబరు, పుట్టిన తేదీ వివరాలు పూర్తి చేయాలి. తదుపరి చేరనున్న కోర్సుల వారీగా ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్‌లలో ఏదైనా ఒక దానిని ఎంపిక చేసుకుని క్లిక్ చేయడంతో స్టెప్-2 దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది.

☛ స్టెప్-3: ఫిల్ అప్లికేషన్‌లో పేమెంట్ చేసిన ఐడీతో పాటు సీనియర్ ఇంటర్ హాల్ టికెట్ నంబరు, పుట్టినతేదీ వివరాలు నమోదు చేయాలి. అనంతరం ప్రొసీడ్ టు ఫిల్ అప్లికేషన్‌పై క్లిక్ చేసి స్టెప్-4కు వెళ్లాలి. అక్కడ నో యువర్ అప్లికేషన్ స్టేటస్‌పై క్లిక్ చేసి, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాన్ని సందర్శించవచ్చు. స్టెప్-5పై క్లిక్ చేసి ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసిన దరఖాస్తు ఫారాన్ని ప్రింట్ తీసుకుని భద్రపరచుకోవాలి.

✦ ఫీజు చెల్లించే సమయంలో ఇచ్చిన రిఫరెన్స్ ఐడీ, విద్యార్థి పేరు, సీనియర్ ఇంటర్ హాల్ టిక్కెట్, పుట్టినతేదీ వివరాలతో భవిష్యత్తులో ఈఏపీ సెట్ హాల్ టిక్కెట్, పరీక్షకు హాజరయ్యే సమయంలో సంబంధిత వివరాలు కీలకంగా మారుతాయి.

'దివ్య'భాగ్యం

- దివ్యాంగులకు యూనిఫైడ్ ఐడీ
- శాశ్వత కార్డు జారీకి కేంద్రం శ్రీకారం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 21 రకాల వైకల్యురుకు అవకాశం



ఆన్‌లైన్‌లో యూడీఐడీ పోర్టల్

కొల్లిపర: దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే చేయూత, ఇతర ప్రయోజనాలకు ఇప్పటివరకు సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. దీనికోసం దివ్యాంగులు గ్రామ సచివాలయంలో, మీసేవా కేంద్రాల్లో సదరం శ్లాట్ బుక్ చేసుకుంటే ప్రభుత్వం నిర్దేశించిన వైద్య శిబిరంలో వైద్యులు వైకల్య నిర్ధారణ అనంతరం సర్టిఫికెట్లు జారీ చేసేవారు. అయితే ఇకపై సదరం సర్టిఫికెట్లుకు కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. వీటి స్థానంలో యూడీఐడీ(యూనిఫైడ్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు) అందించనుంది. ఈ మేరకు స్వావలంబన్‌కార్డు.జీవోవీ.ఇన్(https://www.swavlambancard.gov.in)అనే వెబ్ సైట్‌ను అందుబాటులలోకి ఈనెల 1 నుంచే అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో దివ్యాంగులు నేరుగా ఇంటి వద్ద నుంచి ఫోన్‌లో లేదా ఇంటర్‌నెట్ సెంటర్, మీసేవా కేంద్రాల్లో కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

సేవలు సులభతరం

కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన యూడీఐడీ పోర్టల్ వల్ల సేవలు సులభతరం కానున్నాయి. ఇకపై సదరం శిబిరాల కోసం మీ సేవతోపాటు యుడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికి సదరం శిబిరాలకు సంబంధిచి ఎప్పుడు హాజరు కావాలనే సమాచారం దివ్యాంగుల ఫోన్ నంబర్‌కు సంక్షిప్త సందేశం రూపంలో వస్తుంది. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమయంలో ఎలాంటి తప్పులు, అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి. ఇప్పటి వరకు ఐదు రకాల వైకల్యురుకే మీ సేవ ద్వారా సదరం శిబిరాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. అయితే యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల వైకల్యాలను చేర్చారు. థలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు కూడా సదరం శిబిరాల కోసం యూడీఐడీ పోర్టల్‌లో ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. సదరం శిబిరంలో వైకల్య నిర్ధారణ పూర్తయిన తరువాత సర్టిఫికెట్లను స్మార్ట్ కార్డు రూపంలో పోస్టల్‌శాఖ ద్వారా ఇంటికే పంపించనున్నారు. ఈ కార్డు చేయూత పింఛన్లతోపాటు ఇతర అన్ని సంక్షేమ ప్రయోజనాలకు దేశవ్యాప్తంగా చెల్లుబాటవుతుంది. యూనిఫైడ్ ఐడీ కార్డులను ఆన్‌లైన్ నుంచే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కేంద్రంకల్పించింది. ఇప్పటివరకు సదరం సర్టిఫికెట్లు మన రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటయ్యేవి.

ఇలా దరఖాస్తు చేసుకోండి

ఆన్‌లైన్‌లో స్వావలంబన్‌కార్డు.జీవోవీ.ఇన్ (https://www.swavlambancard.gov.in) వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అప్లయ్ బటన్‌పై క్లిక్ చేస్తే దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి కొన్ని సూచనలు ఉంటాయి. వాటిని పూర్తిగా చదివి అర్థం చేసుకుని తరువాత అంగీకరిస్తూ సబ్‌మిట్ క్లిక్ చేస్తే దరఖాస్తు ఫారం ఓపెన్ అవుతుంది. దివ్యాంగులు వారికి చెందిన పూర్తి సమాచారం అక్కడ అడిగిన విధంగా నమోదు చేస్తే దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. వైద్య పరీక్షలు అనతరం వైబ్‌సైట్‌లో అర్జీ స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకోవచ్చు.

శాశ్వత ఐడీ తప్పని సరి

దివ్యాంగులకు ఇప్పటివరకు సదరం సర్టిఫికెట్లు జారీ చేసేవారు. అయితే ఇకపై శాశ్వతంగా ఆధార్ కార్డు మాదిరిగా కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ(యూనిఫైడ్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు)ను ప్రవేశపెడుతోంది. దివ్యాంగులకు రానున్న రోజుల్లో ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందాలన్నా ఈ కార్డు ఉండాల్సిందే. దివ్యాంగులంతా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని కార్డు పొందాలి.

భార్గవ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, కొల్లిపర మండలం

ధైర్యంగా పదిండి ముందుకు..

- నేటి నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- గుంటూరు జిల్లాలో పూర్తయిన ఏర్పాట్లు
- హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం
- జిల్లా వ్యాప్తంగా 150 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 30,410 మంది విద్యార్థులు



గుంటూరులోని ఓ పరీక్ష కేంద్రంలో రోల్ నంబర్లు వేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ పబ్లిక్ పరీక్షల ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వీటికి గుంటూరు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షలకు హాజరు కానున్న 30,410 మంది విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా 150 కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 470 ఉన్నత పాఠశాలల నుంచి 29,459 మంది రెగ్యులర్ విద్యార్థులతోపాటు గతంలో తప్పిన, ప్రైవేటుగా రాస్తున్న మరో 961 మందిని కలుపుకుని మొత్తం 30,410 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనుండగా, విద్యార్థులు ఉదయం 8.30 కల్లా కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖాధికారులు సూచించారు. హాల్ టికెట్, ప్యాడ్, పెన్ను మినహా ఇతర సామగ్రిని తీసుకురాకూడదని స్పష్టం చేశారు. అలాగే ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో జరగనున్న దూరవిద్య టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న 1,133 మంది అభ్యర్థులకు టెన్త్ రెగ్యులర్ పరీక్ష కేంద్రాల్లోనే 21 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా జైలులో దూరవిద్య టెన్త్ పరీక్షలు రాయనున్న ఖైదీల కోసం ప్రత్యేకంగా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో చల్లని తాగునీరు, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స ఏర్పాట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుశాఖ 144 సెక్షన్ అమలు చేస్తోంది. పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించేందుకు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు వెళ్లి, వచ్చేందుకు వీలుగా హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సదుపాయాన్ని కల్పించారు. పరీక్షలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదులకు డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లు 99513 97109, 90523 43447 ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

దుంపతెంచిన పసుపు

తగ్గిన దిగుబడులు

- దెబ్బతీసిన అధిక వర్షాలు, ప్రతికూల వాతావరణం
- దుంప ఊరే సమయంలో తెగుళ్లు
- నగటున ఎకరాకు 5-10 క్వింటాళ్ల నష్టం



పచ్చి పసుపు ఏరుతున్న కూలీలు

తెనాలి: పచ్చని పసిమితో కళకళలాడుతూ రైతులను ఆశపెట్టిన పసుపు పైరు, దిగుబడిలో మాత్రం డీలా పరుస్తోంది. రైతులు సందేహించినట్టే తక్కువ దిగుబడి చేతికొస్తోంది. దాదాపు సగం విస్తీర్ణంలో ఎకరాకు దిగుబడి 5-10 క్వింటాళ్లు వంతున తగ్గిపోయింది. ఖరీఫ్ సీజనులో అధిక వర్షాలు, అల్పపీడనాలతో ప్రతికూల వాతావరణంతో కొనసాగటమే పసుపు పైరుకు చేటు తెచ్చింది. అక్కడక్కడా తెగుళ్లూ ఆశించాయి. మరోవైపు మార్కెట్ ధర తగ్గుముఖం పట్టటం ఆందోళనపరుస్తోంది.

- జిల్లాలో 2024-25 ఖరీఫ్ సీజనుకు 3,158 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. 2023లో పసుపు మార్కెట్ ధర పతనం కావటంతో ఆ ఏడాది కొందరు రైతులు పసుపు సాగుకు విముఖత చూపారు.
- 2004 సీజనులో పసుపుకు అనూహ్యంగా ధర పెరిగింది. క్వింటాలు రూ.5,000లకు కాస్త అటూ ఇటుగా ధర పెరుగుతూ రూ.14,800 వరకు కొనుగోళ్లు జరిగాయి.
- 2024-25 ఖరీఫ్ సీజనులో పసుపు సాగు విస్తీర్ణం కొంత పెరిగింది. జిల్లాలో అత్యధికంగా కొల్లిపర మండలంలో 1635 ఎకరాల్లో పసుపు వేశారు. కృష్ణా నదికి వరద కారణంగా కరకట్ట లోపల లంక భూముల్లో వేసిన పసుపు పైరు దెబ్బతిన్న విషయం తెలిసిందే.
- ఇతర పంటలతో పోల్చితే పసుపు సాగుకు పెట్టుబడి ఖర్చులు అధికమే. గతేడాది మార్చిలో పెరిగిన మార్కెట్ ధరలతో పసుపు విత్తనం ధర కూడా భారీగానే పెరిగింది. ఎకరాకు ఆరు పుట్ల చొప్పున పసుపు విత్తనం నాటుతారు. ఒక్కో పుట్టి రూ.10 వేలకు కొనుగోలు చేశారు. విత్తనం నాటటం నుంచి ఎండు పసుపు చేతికొచ్చేసరికి ఎకరాకు కనీసం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడులు అనివార్యం.
- కౌలు రైతులకు ఒప్పందం ప్రకారం కుదర్చుకున్న కౌలు రేట్లు అదనం. కౌలు ధర ఎకరాకు రూ.55-60 వేల వరకు ఉంది.

ఓ పక్క వరదలు.. మరో వైపు తెగుళ్లు

- ఆగస్టు/సెప్టెంబరులో కురిసిన భారీవర్షాలతో పల్లపు చేలల్లో నీరు నిలిచింది. కృష్ణానది ఒడ్డున లంక చేలల్లో వేసిన పసుపు పైరు, నదికి వచ్చిన వరదల్లో మునిగింది. అక్కడ చేతికొచ్చేది ఏమీ లేకుండాపోయింది.
- చేలల్లో అక్కడక్కడా దుంపకుళ్లు, తాటాకు తెగులు సోకాయి. భూమిలో పసుపు దుంప ఊరే సమయంలో అంటే గత నవంబరు-డిసెంబరు నెలల్లో దాదాపు నెలరోజులపాటు ముసురు వాతావరణం నెలకొంది. సూర్యరశ్మి పెద్దగా లేకపోవటం పసుపుకు ప్రతికూలమైంది. ఈ కారణాలతో పసుపు దిగుబడి ఈసారి తగ్గిపోయింది. బాగా పండిన చేలో ఎకరాకు 30-35 క్వింటాళ్లు వస్తుండగా సగానికి పైగా విస్తీర్ణంలో 20-25 క్వింటాళ్లు మాత్రం వస్తోందని రైతులు చెబుతున్నారు.



పసుపు చేను ట్రాక్టరుతో దున్నుతున్న దృశ్యం

- దిగుబడి తగ్గినప్పటికీ మార్కెట్ ధర బాగుంటే రైతులు ఒడ్డునపడతారు. గతేడాది పసుపు చేతికొచ్చే సమయానికి క్వింటాలు రూ.12 వేలు ధర ఉంది. క్రమేపీ పెరుగుతూ సీజనులో గరిష్ఠంగా రూ.15 వేల వరకు కొనుగోళ్లు జరిగాయి. ఇటీవల వరకు క్వింటాలు రూ.11 వేలకు అమ్మకాలు జరగగా, ఇప్పుడు పంట చేతికొచ్చే సమయంలో వెయ్యి రూపాయల మాంద్యం నెలకొంది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు రూ.10 వేల ధర ఉంది. దిగుబడులు తగ్గిపోయి, మార్కెట్ ధరలు ఆశాజనకంగా లేకపోతే రైతులు నష్టపోయే ప్రమాదముంది. మార్కెట్ ధర హీనపక్షం రూ.11 వేలు ఉండాలని రైతులు కోరుకుంటున్నారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు



పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంబటి, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంత్యుత్సవం నిర్వహించారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆమరణ దీక్ష చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కీర్తించారు. ఆమరణ దీక్షలు ఎంతో మంది చేస్తారని, ఆశయ సాధన కోసం, తెలుగు ప్రజల కోసం ఆయన చేసి త్యాగం మరువలేనిదన్నారు. పార్టీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాన్ని సైతం తృణప్రాయంగా విడిచిపెట్టిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. అనంతరం హిందూ కళాశాల కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మెట్టు వెంకటప్పారెడ్డి, మండేపూడి పురుషోత్తం, మామిడి రాము, నందేటి రాజేష్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, చదలవాడ వేణు, దేవరశెట్టి సత్యనారాయణ, ఈమని రాఘవరెడ్డి, రేపాడి రంజన్‌బాబు, జెడ్పీటీసీలు విప్పల కృష్ణారెడ్డి, పిల్లి ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసరావు, రజియాబేగం, కళ్ళం హరికృష్ణారెడ్డి, కోటేశ్వరరావు, నాజర్‌వలి, చింతపల్లి రమణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

19న అగ్రిగోల్డ్ బాధితులతో 'చలో విజయవాడ'

లక్ష్మీపురం: అగ్రిగోల్డ్ బాధితులతో ఈనెల 19న 'చలో విజయవాడ' నిర్వహించనున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ - ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, ఉప ప్రధాన కార్యదర్శి బి.వి.చంద్రశేఖరరావు ఆదివారం విజ్ఞప్తి చేశారు. బాధితుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించాలని కోరుతూ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ధర్నా చౌక్ వరకు 'కన్నీటి పాదయాత్ర' నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అనంతరం ధర్నా చౌక్‌లో సభ ఉంటుందని, పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలియజేశారు. అగ్రిగోల్డ్ బాధితులందరూ తరలిరావాలని ఆయన కోరారు.

నృసింహునికి పుష్పయాగోత్సవం



మంగళగిరి: మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం పుష్పయాగోత్సవం వైభవంగా నిర్వహించారు. 11 రోజుల నుంచి జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి వివిధ రకాల పుష్పాలతో యాగోత్సవం నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో జరిగిన ఈ ఉత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని పుష్ప సేవ చేశారు. ఉత్సవానికి కైంకర్యపరులుగా నందం సాంబశివరావు, శాంతికుమారి వ్యవహరించగా ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

క్లుప్తంగా

సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్నిక



జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు



జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ

లక్ష్మీపురం: సీఐటీయూ గుంటూరు జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.లక్ష్మణరావు, దండా లక్ష్మీనారాయణలను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాత గుంటూరులో ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. నూతనంగా జిల్లా ఉపాధ్యక్షులుగా సీహెచ్ నాగ బ్రహ్మచారి, కే బాబు ప్రసాదు, జిల్లా కార్యదర్శులుగా వై.నేతాజీ, వై.రమణ (శ్రామిక మహిళ)లను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో చింతల శ్రీనివాసరావును ఎన్నుకున్నారు.

వైభవంగా పునఃప్రతిష్టా మహోత్సవాలు

గొరిగపూడి(భట్టిప్రోలు): మండలంలోని ప్రసిద్ధి గాంచిన గొరిగపూడి శ్రీ భ్రామరీ దుర్గాదేవి సమేత శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానం జీవధ్వజ విమాన గోపుర శిఖర సహిత పునః ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ప్రాచీన ఆలయం జీర్ణోద్ధరణ గొప్ప కార్యమని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. ఉత్సవాలలో మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు జననం



గుంటూరు మెడికల్: హైదరాబాద్‌కు చెందిన పద్మావతి(24)కి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. నాటి నుంచి పిల్లలు లేక అనేక ఆసుపత్రులకు తిరిగి ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో గుంటూరు సిటిజన్ హాస్పిటల్‌కు చికిత్స కోసం వచ్చారు. గైనకాలజిస్ట్ డాక్టర్ భాగ్యలక్ష్మి వైద్య పరీక్షలు చేసి సంతాన చికిత్స అందించారు. గర్భం దాల్చి ఆదివారం ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చారు. ఇది చాలా అరుదుగా జరుగుతుందని డాక్టర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ముగ్గురు ఆడశిశువులని, ఇరువురు 1.5 కేజీలు, ఒక శిశువు 1.4 కేజీలు ఉన్నట్లు చెప్పారు. వైద్య చికిత్సలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాజా సహకారం అందించినట్లు పేర్కొన్నారు.

హామీలు అమలు చేయకుంటే సమ్మె చేస్తాం

వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కారరావు



మాట్లాడుతున్న జి.ఆస్కారరావు

గుంటూరు మెడికల్: ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్య వర్గ సమావేశం ఆదివారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కన ఉన్న డ్రైవర్స్ అసోసియేషన్ హాలులో జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆస్కార రావు మాట్లాడుతూ తాము ప్రభుత్వం ముందు ఉంచిన సమస్యలన్నీ ఆర్థికేతర అంశాలేనని చెప్పారు. తమ సంఘం తరఫున సుమారు 28 డిమాండ్‌లను లిఖిత పూర్వకంగా తెలియజేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం నేటికీ వాటిని పరిష్కరించిన పాపానపోలేదని వాపోయారు. ఇక పోరాటం తప్పదని తేల్చి చెప్పారు. త్వరలో సమ్మె నోటీసు జారీ చేస్తామన్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆహారోన్ మాట్లాడుతూ తమ సంఘాన్ని బలోపేతం చేయడం ద్వారా ఉద్యమానికి జిల్లా శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అధికారులు సత్వరమే మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలన్నారు. సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ సాగర్ మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ముఖ్య సలహాదారు రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు సాగర్, రాష్ట్ర కోశాధికారి బాబా సాహెబ్, ఉపాధ్యక్షులు లక్ష్మీ నారాయణ, కృష్ణారెడ్డి, సయ్యద్ చాంద్ బాషా, దుర్గా ప్రసాద్, సత్య నారాయణ బాబు, అపరంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- భర్తే చంపాడంటూ యువతి కుటుంబ సభ్యుల ఆందోళన
- గుంటూరులో ఘటన



గీతిక మృతదేహం



ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

గుంటూరు రూరల్: ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన యువతిని ఓ యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే ఆ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణ వరంగల్‌కు చెందిన గీతిక(20) గుంటూరుకు చెందిన కొప్పుల సాయికుమార్‌కు ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైంది. అది కాస్తా ప్రేమగా మారడంతో గతేడాది వారు పెళ్లి చేసుకున్నారు. గుంటూరు అమరావతి రోడ్డులో ఇంటిని అద్దెకు తీసుకుని కాపురం పెట్టారు. కాగా, మార్చి 14వ తేదీన గీతిక తన తల్లిదండ్రులకు ఫోన్‌చేసి సాయికుమార్ తనను సరిగా చూడడం లేదని.. మద్యం, గంజాయికి బానిసై చిత్రహింసలకు గురిచేస్తున్నాడని చెప్పింది. తాను ఇంట్లోంచి పారిపోతానని ఇంటివద్ద ఒకరిద్దరిని కాపలా పెట్టేవాడని వాపోయింది. అయితే అదే రోజు రాత్రి గీతిక ఉరేసుకుని చనిపోయినట్టు ఆమె తల్లిదండ్రులకు సాయికుమార్ సమాచారం ఇచ్చాడు. దీంతో తల్లిదండ్రులు గుంటూరు చేరుకుని సాయికుమారే తన కుమార్తెను ఉరివేసి చంపాడంటూ ఆదివారం అతని ఇంటి ముందు ఆందోళనకు దిగారు. గీతిక శరీరంపై కొట్టినట్టు గాయాలుండటంతో నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు సీఐ వంశీధర్ చెప్పారు. కాగా, మృతురాలు మూడు నెలల గర్భిణీ అని తెలిసింది.

వైభవంగా మహాశైవక్షేత్ర పునఃప్రతిష్ట

దాచేపల్లి: దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామ సమీపంలోని శ్రీ పార్వతిదేవి సమేత చెన్న మల్లిఖార్జునస్వామి వార్ల దేవస్థానం(మహాశైవక్షేత్రం) పునఃప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతులు శివస్వామి, టీటీడీ బోర్డు సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రామకృష్ణమచార్యుల బృందం వేదమంత్రాల సాక్షిగా పార్వతీదేవి సమేత చెన్నమల్లిఖార్జునస్వామి, గణపతి, ద్వారపాలకులు, నందీశ్వరుడు, బలిపీటం, శిఖరాన్ని ప్రతిష్టించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్. నాయుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అతిథులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. పల్నాటి తొలిమహిళా మంత్రి నాయకురాలు నాగమ్మ నిర్మించిన ఈ మహాశైవక్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు.

నేడు విధులు బహిష్కరణ

గుంటూరు మెడికల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న, 24వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలు బహిష్కరిస్తున్నామని ఏపీ వైద్య సేవ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ కుమారి ఆదివారం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోందన్నారు. ఆప్కాస్ రద్దు దిశగా ఇప్పటికే అడుగు లేసిన ప్రభుత్వం ఏప్రిల్ నుంచి బీమా సేవలు కొనసాగుతాయని తెలియజేసిందని పేర్కొన్నారు. ఈ పరిణామాలతో రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. సోమవారాలు విధులు బహిష్కరించి జిల్లా సమన్వయకర్త అధికారి ఆఫీస్ దగ్గర శాంతియుత నిరసన తెలపాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

సహజీవనం చేసి పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): మహిళతో సహజీవనం చేసి పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురం ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన పల్లపు నాగదుర్గ ఐదేళ్ల క్రితం భర్తతో విడిపోయింది. తన కుమార్తెతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. పొలం పనులు చేసుకునే ఆమెకు సత్తెనపల్లికి చెందిన కొక్కిలిగడ్డ మోజెస్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. అప్పటి నుంచి మోజెస్ విజయవాడ వస్తూ ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలని నాగదుర్గ కోరగా ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో ఆమె సత్తెనపల్లి వెళ్లి మోజెస్ తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. అతను రెండు నెలల్లో పెళ్లి చేసుకొంటానని చెప్పి గుంటూరు నెహ్రూనగర్ పాత బస్‌స్టాండ్ వద్ద రూమ్ తీసుకొని కొన్ని నెలలు కాపురం చేసి వెళ్లిపోయాడు. నాగదుర్గ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: కేసానుపల్లిరోడ్డులోని టిడ్కో గృహాల పక్కనే ఉన్న రైలుపట్టాలపై ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గుంటూరు –డోన్ ఎక్స్‌ప్రెస్ రైలు బండి కింద పడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య చేసుకుందని రైల్వే ఎస్ఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. మృతురాలు శరీరం నలుపు రంగుతోను, ఒంటిపై నీలం రంగు పూల డిజైన్ చీర, నీలం రంగు జాకెట్టు ధరించి ఉందన్నారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీలో భద్రపర్చామన్నారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను 94404 38256, 70136 00365 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

తులసీ తన్మయ్‌కు బంగారు పతకం



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల నర్సింగ్ విద్యార్థిని వి.తులసీతన్మయ్ తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు ఆదివారం తెలిపారు. తెనాలిలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 5వ గుంటూరు (జిల్లా) ఆహ్వాన తైక్వాండో చాంపియన్‌షిప్–2025 పోటీలో తులసీ తన్మయ్ 49 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించినట్టు వివరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, నర్సింగ్ విభాగం ఇన్‌చార్జి ఏవీఎస్ గుప్త తదితరులు తులసీ తన్మయ్‌ను అభినందించారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



వెంకట సత్యం మృతదేహం

వెల్దుర్తి: లారీని ఓవర్‌టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొని బైక్‌పై వెళుతున్న యువకుడు మృతి చెందిన ఘటన వెల్దుర్తి బస్టాండ్ సెంటర్ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ళ వెంకట సత్యం (23), మరిపూడి మణికంఠలు ద్విచక్ర వాహనం పై మాచర్లకు వచ్చి వడ్డెర ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరిగి గుండ్లపాడుకు వెళ్తున్న సమయంలో వెల్దుర్తి బస్టాండ్ వద్ద 565 జాతీయ రహదారిపై లారీని ఓవర్‌టేక్ చేస్తూ, తప్పించబోయి, పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారమివ్వటంతో వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరినీ మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో వెంకట సత్యం మృతి చెందాడు. మణికంఠకు తీవ్రగాయాలు కావటంతో వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేట వైద్యశాలకు రిఫర్ చేశారు. మృతి చెందిన వెంకట సత్యంకు భార్య రమాదేవి, ఏడాది వయస్సు ఉన్న కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం రమాదేవి నాలుగు నెలల గర్భిణిగా ఉందని బంధువులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నల్ల బర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయించాలి



చందలూరులో రైతులతో మాట్లాడుతున్న రమాదేవి

జె.పంగులూరు: నల్ల బర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమాదేవి కోరారు. పంగులూరు మండలంలోని చందలూరు దళిత కాలనీ కౌలు రైతులతో సీపీఎం ప్రచార యాత్ర నాయకులు ఆదివారం మాట్లాడారు. పొగాకు అమ్ముడు పోక, అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని రైతులు తెలిపారు. పంట నష్టపరిహారాలు కూడా అందటం లేదని, రాయితీలు కూడా భూ యజమానులకే అందుతున్నాయని వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీపీఎం కార్యవర్గ సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ బర్లీ పొగాకును కూడా బోర్డు పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు కంపెనీలు ఇష్టానుసారంగా ధరలు తగ్గించడం, ఆలస్యంగా కొనడంతో రైతులు నష్టపోతున్నారని ఆమె తెలిపారు. సీపీఎం బాపట్ల కార్యదర్శి సీహెచ్. గంగయ్య మాట్లాడుతూ కౌలు రైతులంగా ఐక్యంగా ఉండాలని తెలిపారు. ఐకమత్యంతో ఏదైనా సాధించగలమని చెప్పారు. హక్కుల కోసం పోరాడాలని, దాని కోసం సంఘాలుగా ఏర్పడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు రాయిని వినోద్‌బాబు, పార్టీ మండల కార్యదర్శి రామారావు, ప్రభాకర్, సుధాకర్, కౌలు రైతులు పాల్గొన్నారు.

పేద ఖైదీలకు ఉచిత న్యాయసహాయం

- జిల్లా న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ పార్థసారథి
- సత్తెనపల్లి సబ్‌జైలు సందర్శన



సత్తెనపల్లి సబ్ జైలులో రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి పార్థసారథి

సత్తెనపల్లి: ఆర్థిక స్తోమత లేని పేద రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ పార్థసారథి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జియావుద్దీన్‌తో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను, ఆహారం, దానికి ఉపయోగించే సరుకుల నాణ్యతను పరిశీలించారు. అంతేకాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా అనే కోణంలో కూడా పరిశీలించి అన్ని అంశాల పై సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్ రెడ్డి, సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు, సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం, తదితరులు ఉన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ రామానాయక్

ప్రత్తిపాడు: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను వట్టిచెరుకూరు పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీస్ స్టేషనులో ఆదివారం విలేకరులతో సీఐ ఎం.రామానాయక్ ఈ వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. వట్టిచెరుకూరు మండలం ముట్లూరుకు చెందిన అల్లం సాయి సాంబశివరావు ఉరఫ్ సాయి, అల్లం నరేంద్ర ఉరఫ్ నానిలు విలాసాలకు అలవాటై దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొద్దిరోజుల కిందట ముట్లూరులోని అల్లం కిరణ్ కుమార్ ఇంట్లో, ఆయనకు చెందిన సాత్విక వే బ్రిడ్జిలో దొంగతనానికి పాల్పడ్డారు. ఆ డబ్బుతో కేజీల్లో గంజాయి కొనుగోలు చేసి ప్యాకెట్లు పరిసర గ్రామాల్లో విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి లేమల్లెపాడు నుంచి ముట్లూరు వెళ్లే డొంకలో బాపయ్య చెరువు రావి చెట్టు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బృందాలుగా వెళ్లారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు చిన్న బంగారు ఉంగరాలు, ఒక జత వెండి పట్టీలు, రెండు కేజీల గంజాయి, కంప్యూటర్ సీపీయూ, మోనిటర్, హెచ్‌పీ ప్రింటర్, దొంగతనాలకు వినియోగిస్తున్న ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అల్లం సాంబశివరావును పోలీసులు విచారించగా గతంలో గ్రామ సచివాలయంలో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాడని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బలమైన పోరాటాలు అవసరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న కె.రామకృష్ణ

లక్ష్మీపురం: అణగారిన వర్గాలు, పేదల సమస్యల పరిష్కారం కోసం బలమైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఉన్న మల్లయ్యలింగం భవన్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలలో భాగంగా ఆదివారం మొదటి రోజు వర్క్‌షాప్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వాలు చెబుతున్న దానికి, ఆచరణలో జరుగుతున్న దానికి పొంతన లేకుండా ఉందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు గ్రామీణ పేదలు, చేతివృత్తుల వారికి నూతనంగా ఒక్క స్కీమ్ తీసుకువచ్చారా? అంటూ ప్రశ్నించారు. మతాన్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని కేంద్రం చూస్తోందన్నారు. లిబ్టెక్ సంస్థ డైరెక్టర్ చక్రధర్ బుద్ధ, డీఆర్డీఏ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రావు, ఆఫీస్ బేరర్స్ కాబోతు ఈశ్వరరావు, బి. వెంకటేశ్వరరావు, బి. కేశవరెడ్డి, చిలుకూరి వెంకటేశ్వరరావు, ఆర్.విజయ, సి.సుబ్రమణ్యం, కరిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు



విలేకర్లతో మాట్లాడుతున కేశన, బీసీ నాయకులు

నరసరావుపేట: కేంద్రంలోని బీజేపీ నాయకులు, రాష్ట్రంలో టీడీపీ కూటమి నాయకులు ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణానికి వచ్చిన ఆయన పల్నాడు బస్టాండ్‌లో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే, విశ్వకర్మ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఒక హోటల్‌లో పత్రిక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు కేంద్రంలో బీసీ కులాల జనగణన చేపడతామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి చూపుతోందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ రక్షణ చట్టం తెస్తామని, నామినేటెడ్ పదవులలో బీసీలకు 50 శాతం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసించడానికి బీసీ విద్యార్థులకు ఎంట్రన్స్ ఫీజులు ఓసీలతో సమానంగా వసూలు చేస్తున్నారని, వెంటనే లా సెట్, ఎంసెట్, పాలీసెట్, ఇతర అన్ని రకాల సెట్లకు బీసీ విద్యార్థులకు ఎంట్రన్స్ ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా అధ్యక్షుడు యామా మురళి మాట్లాడారు. సంఘం నరసరావుపేట నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా సుతారం విశ్వేశ్వరరావును నియమించారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు కాకుమాను రమేష్, నరసరావుపేట, రొంపిచర్ల మండల అధ్యక్షులు నాగారపు గురు ఆంజనేయులు, గాలి సాంబశివరావు, రజక సంఘ నాయకులు చట్టా శ్రీరాములు పాల్గొన్నారు.

జాతీయ భావంతో విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో నాయకులు

బాపట్ల: విద్యార్థుల సమస్యలపై పోరాటంతో పాటు వారిని జాతీయ భావాలతో నిర్మాణాత్మక తీర్చిదిద్దడమే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లక్ష్యం అని రాష్ట్ర అధ్యక్షులు నూజెండ్ల శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల పట్టణంలోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపం ప్రాంగణంలో ఆదివారం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరిగాయి. తొలుత రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రిటైర్డ్ రీడర్ యు. వరలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూజెండ్ల మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. వరలక్ష్మి మాట్లాడుతూ 50 సంవత్సరాల కిందట మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో కలిసి ఏబీవీపీ కార్యక్రమాల్లో చేపట్టిన పనులను గుర్తు చేసుకున్నారు. నేటి యువత సమాజంలో రుగ్మతలు రూపుమాపటానికి ఏ విధంగా ముందుకు వెళ్లాలో సూచించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సదస్సుకు వచ్చిన ఏబీవీపీ యువ కెరటాలకు అభినందనలు తెలిపారు. దక్షిణ భారత సంఘటన కార్యదర్శి ఎస్. శివకుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన ఏకైక విద్యార్థి యూనియన్ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని పేర్కొన్నారు. ఏబీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాగంటి వెంకట గోపి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా వెంటనే డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువతకు నిరుద్యోగ భృతి నెలకు రూ. 3000 అందజేస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు 10 నెలలు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నిరుద్యోగ యువతకు వెంటనే భృతి అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదులో ఉండిపోయాయని, వాటిని తిరిగి రాష్ట్రంలో నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ సూళ్లూరు యాచేంద్ర, వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, ప్రముఖ ఆడిటర్ చాపల సుబ్రహ్మణ్యం, న్యాయవాది కళ్లం హరినాథ్ రెడ్డి, అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్, నంగు ఏడుకొండలురెడ్డి, వల్లూరి భావన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.